క్లుప్తంగా

ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

టేకులపల్లి: ప్రజలకు సురక్షితమైన నీటిని అందించేందుకు ఎంపీ నిధులతో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ తన నిధులు రూ.4.99 లక్షలతో మండలంలోని సుక్కాలబోడు పంచాయతీ జేత్యా తండాలో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్యా గంగబాయి, కాంగ్రెస్ నాయకులు దళ్‌సింగ్, ఎస్‌ఐ అలకుంట రాజేందర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం గోలియా తండాలో ఏర్పాటు చేసిన సహస్ర ట్రేడర్స్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ నాయక్, ఈది గణేష్, రెడ్యా నాయక్, పోశాలు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

పాల్వంచరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీని పొందాలంటే హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ డెలివరీ బోయ్స్ ఇంటికి వచ్చినప్పుడు వారికి సహకరించి ఈ కేవైసీ చేయించుకోవాలని అర్హత కలిగిన వారు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500 గ్యాస్ సిలెండర్‌ను పొందే అవకాశం ఉంటుందన్నారు. గ్యాస్ కనెక్షన్ తీసుకున్న ఐదు సంవత్సరాలు దాటిన ప్రతీ వినియోగదారుడికి రూ.190 తీసుకుని పైపును మార్చి గ్యాస్ నంబర్‌కు హెచ్‌పీసీఎల్ ప్యాకేజీలో అప్‌డేట్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కెవైసీ చేయించుకోని వినియోగదారులకు గ్యాస్ సరఫరాలో ఆటంకం కలిగినా, ప్రమాదవశాత్తు ఏమైనా జరిగినా హెచ్‌పీ గ్యాస్, పౌర సరఫరాల సంస్థ, హెచ్‌పీసీఎల్ ఎలాంటి బాధ్యత వహించదన్నారు.

విద్యార్థులకు జీఎం అభినందన



విద్యార్థులతో సింగరేణి అధికారులు

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి సేవా సమితి ద్వారా శిక్షణ పొంది రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులను సింగరేణి కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలోని జీఎం (పర్సనల్) వెల్ఫేర్ – సీఎస్‌ఆర్ కిరణ్‌కుమార్ శనివారం అభినందించారు. ఆదియోగి పరమేశ్వరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ మణికొండలోని భాష్యం బ్లూమ్ స్కూల్‌లో 4వ రాష్ట్రస్థాయి యోగా చాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించి, విజేతలుగా రావాలని ఆకాంక్షించారు. డీజీఎం (పర్సనల్) కేసా నారాయణరావు, యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ పాల్గొన్నారు.

పూల వ్యాపారుల సంఘం ఏర్పాటు

ఇల్లెందు: ఏఐటీయూసీకి అనుబంధంగా పూల వ్యాపారుల సంఘం ఏర్పడింది. శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణంలోని పూల వ్యాపారులు సమావేశమై నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా కె.సారయ్య, అధ్యక్షుడిగా ఖాజాపాషా, కార్యదర్శిగా నాగుల్ మీరాతో పాటు 25 మందితో కమిటీని నియమించారు. వీరంతా సీపీఐ, ఏఐటీయూసీకి అనుబంధంగా పని చేస్తామని ప్రకటించారు. పూల వ్యాపారులకు సీపీఐ అండగా ఉంటుందని సీపీఐ రాష్ట్ర నాయకుడు కె.సారయ్య అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు డి.శంకర్, పట్టణ కార్యదర్శి బాస శ్రీనివాసరావు, ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి నజీర్ అహ్మద్, దాసరి రాజారావు, గడదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన వంగడాలను ఎంచుకోండి..

ఇల్లెందురూరల్: చీడపీడలను తట్టుకునే విధంగా రూపొందించిన, అధిక దిగుబడులను ఇచ్చే నూతన వంగడాలను రైతులు ఆదరించాలని శ్రీకర్ సీడ్స్ డైరెక్టర్ మల్లికార్జున్ సూచించారు. మండలంలోని కొమరారం గ్రామంలో శనివారం మొక్కజొన్నలో నూతన వంగడాల ప్రత్యేకలపై రైతులు, విత్తన వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. క్షేత్ర పర్యటన చేసి నూతన వంగడాలను పరిచయం చేశారు. విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

బంతి సాగు.. భలే బాగు

- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతుల ఆసక్తి
- ఈ ఏడాది అధిక వర్షాలతో తగ్గిన బంతిపూల దిగుబడి
- తోటల వద్దనే పూల అమ్మకం



వెంగన్నపాలెంలో బంతిపూల తోట

(ఇన్‌సెట్) తల్లాడ - కొత్తగూడెం ప్రధాన రహదారి పక్కన పూలు విక్రయిస్తున్న మహిళా రైతు

జూలూరుపాడు: ప్రకృతి వైపరీత్యాల కారణంగా అతివృష్టి, అనావృష్టితో రైతులు అప్పుల ఊబిలో కూరుకపోతున్నారు. ఏటా ఏదో ఒక రకంగా పండించిన పంటలు దెబ్బతినడంతోపాటు, గిట్టుబాటు ధరలు రావడం లేదు. పెట్టుబడి, కూలీల కొరతతో సతమతమవుతున్నారు. దీంతో అన్నదాతల ఆలోచన విధానం మారింది. పత్తి, మిరప, వరి పంటలు లాభసాటిగా లేకపోవడంతో ప్రత్యామ్నాయం మొగ్గు చూపుతున్నారు. బంతి, కరివేపాకు, బొప్పాయి, మునగ, జామాయిల్, సుబాబుల్, పామాయిల్, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు వంటి పంటల సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీనికి కారణం తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, లాభాలు. ప్రతీ ఏటా వాణిజ్య పంటల సాగుతో తీవ్రంగా నష్టపోతుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి మళ్లించారు. పలువురు రైతులు తక్కువ వ్యవధిలో చేతికి వచ్చే బంతి సాగుపై మొగ్గు చూపుతున్నారు. మూడు నెలల్లోనే ఆదాయం తెచ్చిపెట్టే బంతి సాగుకు పెట్టుబడి కూడా తక్కువ. వాతావరణం అనుకూలంగా ఉంటే ఎకరానికి 3 టన్నుల వరకు దిగుబడి వస్తుందని, ఈ ఏడాది అధిక వర్షాలు కారణంగా 2.5 నుంచి 3 టన్నులకు దిగుబడి తగ్గిందని రైతులు అంటున్నారు. జూలూరుపాడు మండలంలో వెంగన్నపాలెం, జూలూరుపాడు గ్రామాలకు చెందిన ఎక్కువ మంది రైతులు బంతు సాగు చేస్తున్నారు.

పూలసాగు లాభసాటి..

బంతిపూల సాగుపై తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి రావడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది మల్చ్ విధానంలో బంతిపూల సాగు చేయడంతో రైతులకు పెట్టుబడి గణనీయంగా పెరిగింది. ఎకరంలో బంతి సాగుకు చేయడానికి బంతి నారు, నాటు కూలీలకు, ఎరువులకు, కలుపు తీయడానికి, మల్చ్ పేపర్, డ్రిప్ పైపులకు అయిన ఖర్చుతో కలిపి మొత్తం సుమారు రూ.80 వేలు అవుతుందని రైతులు చెపుతున్నారు. ఈ ఏడాది అధిక వర్షాలతో కొంతమేర దిగుబడి తగ్గినా ధర ఆశాజనకంగా ఉండటంతో పెట్టుబడులు పోను ఎకరానికి రూ.50 - రూ.70 వేల వరకు లాభం ఉంటుందని అంటున్నారు. ఈనెలలో బతుకమ్మ, శ్రీదేవీ శరన్నవ రాత్రోత్సవాలకు బంతి పూలకు గిరాకీ బాగా వచ్చింది. అదేవిధంగా ఈ నెలలో దీపావళి తరువాత అయ్యప్పమాలధారులు, కార్తీకమాస పూజలు, శుభకార్యాల సీజన్ కావడంతో మార్కెట్‌లో బంతిపూలకు మంచి డిమాండ్ ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కేజీ పూల ధర రూ.60 - రూ 70 ఉందని, రాబోయే రోజుల్లో రూ.100 - రూ.120 పలుకుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. బంతి పూల దిగుబడి తగ్గడంతో నిరాశ ఉన్నప్పటికీ ప్రస్తుతానికి ధర ఆశాజనకంగా ఉందన్నారు. కేజీ బంతి పూల ధర రూ.100 పైగా లభిస్తే గిట్టుబాటు అవుతుందని, మిగతా పంటలకంటే లాభాలు వస్తాయని చెబుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే సాగు చేసిన రైతులు బంతి పూలను అక్కడే రోడ్డు పక్కన విక్రయిస్తున్నారు. వాహనదారులు ఆగి పూలు కొనుగోలు చేస్తున్నారు.

సండే స్పెషల్

దిగుబడి తగ్గింది..



పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తే పెట్టుబడికి చేసిన అప్పు కూడా తీరడం లేదని తొమ్మిదేళ్లుగా బంతి సాగు చేస్తున్నాం. అధిక వర్షాలు కారణంగా ఈ ఏడాది పూల దిగుబడి తగ్గింది. సుమారు 1.10 ఎకరాల్లో బంతి సాగు చేసినం. రూ. ఒక లక్ష పెట్టుబడి అయింది. అయినా బాగానే ఉంది.

– పోరుండ్ల సైదులు, రైతు, వెంగన్నపాలెం

ఆరేళ్లుగా సాగు చేస్తున్నాం..



ఆరేళ్లుగా బంతి సాగు చేస్తున్నాం. పత్తి పంటకు ఏటా తెగుళ్లు, గిట్టుబాటు ధర కూడా ఉండడం లేదు. ఒక ఎకరం రూ.30 వేలకు కౌలుకు తీసుకొని బంతి సాగు చేశాం. రూ.75 వేలు పెట్టుబడి అయింది. ప్రస్తుతం కేజీ పూలు రూ.60 అమ్ముతున్నాం. రూ.100 ఉంటే లాభం ఉంటుంది.

– ఏదులాపురం నాగుల్‌మీరా, రైతు, వెంగన్నపాలెం

ఆశాజనకంగా ధర..



ప్రస్తుతం బంతి పూల ధర ఆశాజనకంగా ఉంది. నెల రోజులుగా జోరుగా వానలు కురుస్తుండటంతో పూలు దెబ్బతినడంతో దిగుబడి తగ్గింది. బతుకమ్మ, దసరా ఉత్సవాలు ప్రారంభంతో పూలు కొనుగోళ్లు జరుగుతున్నాయి. పూల దిగుబడి మరో మూడు నెలలు పాటు ఉంటుంది.

– పోరుండ్ల రాంబాబు, రైతు, వెంగన్నపాలెం

ప్రభుత్వంపై ఆందోళన తప్పదు



మాట్లాడుతున్న ఫహీందాదా

సూపర్‌బజార్(కొత్తగూడెం): కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు భారీగా పెంచిన వివిధ ఫీజులను ఉపసంహరించుకోకపోతే ప్రభుత్వంపై ఆందోళన తప్పదని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక శేషగిరి భవన్‌లో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకేసారి భారీ మొత్తంలో పెంచిన ఫీజులతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఖయ్యూం, చంద్రగిరి ప్రసాద్, రసూల్ పాషా, కొచ్చెర్ల రాకేష్, ఎస్‌కే జావీద్, రణధీర్, కె రవి, చింటూ పాల్గొన్నారు.

జూలూరుపాడు: కాకతీయ విశ్వవిద్యాలయం పెంచిన ఫీజులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ డిమాండ్ చేశారు. శనివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాలల్లో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందిన విద్యార్థులకు భారీగా ఫీజులు పెంచడం దారుణమన్నారు. ఒక్కో విద్యార్థికి గతంలో రిజిస్ట్రేషన్ ఫీజు రూ.80 ఉండగా, ఇప్పుడు రూ.1200, రికగ్నేషన్ ఫీజు రూ.400 నుంచి రూ.800, ఐయూడీఎఫ్ ఫీజు రూ.60 నుంచి రూ.300, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఫీజు రూ.50 నుంచి రూ.200లకు పెంచడంతో విద్యార్థులపై భారం పడుతుందన్నారు. గతంలో అన్ని రకాల ఫీజులు రూ.1340 చెల్లించే వారని, ఇప్పుడు రూ.3,250లకు పెంచడం గర్హనీయమన్నారు. పెంచిన ఫీజులు ఉపసంహరించుకోకపోతే ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల పక్షాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్ పరిశీలన

పాల్వంచ: స్థానిక కరకవాగు వద్ద గల మున్సిపల్ ఫిల్టర్ బెడ్‌ను శనివారం బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. మాట్లాడుతూ ఇటీవల కార్పొరేషన్ కమిషనర్ కె.సుజాతను కలిసి పాల్వంచకు వచ్చే తాగునీరు మురికిగా వస్తున్నాయని, ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలిజేయడంతో శుభ్రం చేయించారన్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైఆర్.నాయుడు, మల్లెల శ్రీరామ్మూర్తి, భట్టు మంజుల పాల్గొన్నారు.

జెన్కో కార్యవర్గం ఎన్నిక

పాల్వంచ: టీఆర్‌వీకేఎస్ జెన్కో కార్యదర్శిగా కేటీపీఎస్ 7వ దశ జేఏఓ ముత్యాల రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్ మింట్ కాంపౌండ్‌లోని టీఆర్‌వీకేఎస్ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.జాన్సన్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి జెన్కో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురిని రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పాశం రవిబాబు, అసిస్టెంట్ సెక్రటరీగా తిప్పారపు రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టి.అజయ్, అడిషనల్ సెక్రటరీగా రాసూరి శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీగా కె.భిక్షపతి, ట్రెజరర్‌గా తిరుపతిలను ఎన్నుకున్నారు.

రిజర్వేషన్ తొలగించడం రాజ్యాంగ విరుద్ధం

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో వెనుకబడ్డ ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు రాజ్యాంగపరమైన రాజకీయ రిజర్వేషన్ దామాషా ఆధారంగా అమలు చేయకపోవడం రాజ్యాంగ విరుద్ధం అని ట్రేడ్ యూనియన్ జాతీయ నాయకులు, షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ గౌరవ సలహాదారు గొల్లపల్లి దయానందరావు అన్నారు. శనివారం సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ లేకుండా జెడ్పీటీసీలు, ఎంపీటీసీలను జనరల్‌లో కలిపి తప్పిదం చేసిందని, అదే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్ 42 శాతం అమలు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల సమస్య పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి దాటవేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ హక్కులు పేద ప్రజలకే దక్కాలన్నదే రాజ్యాంగ సూత్రమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసి వ్యవస్థాపకులు బొమ్మెర శ్రీనివాస్, భూమి పుత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూసపాటి శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర నాయకులు ఎస్డీ రషీద్, షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట రాష్ట్ర జేఏసీ కోకన్వీనర్ వేల్పుల భాస్కర్, ఇండికాపల్లి శంకర్, మంద వెంకటేశ్వర్లు, కన్నం చంద్రయ్య, సలిగంటి కొమరయ్య, స్వామి, రాజకుమార్, వీరస్వామి పాల్గొన్నారు.

అమ్మ దయ.. సింగరేణి కార్మికులకు రక్ష



సింగరేణి(కొత్తగూడెం): అన్నదానం ప్రారంభిస్తున్న జీఎం, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కనకదుర్గ అమ్మవారి దయ సింగరేణి కార్మికులకు రక్ష అని, సింగరేణి సంస్థ అన్నిమతాలకు నిలయమని, సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో దసరా సందర్భంగా గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద దేవీనవరాత్రులు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందని సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ కేవీ సూర్యనారాయణ అన్నారు. కొత్తగూడెం ఏరియాలోని జీఎం కార్యాలయంలో నిర్వహించిన కనకదుర్గ అమ్మవారి వేడుకల సందర్భంగా శనివారం మహాన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జీఎం ఎం.శాలేంరాజు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం రామకృష్ణ, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీలో శ్రీ దుర్గాభవానీ మాత ఆలయంలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. శనివారం జీఎం వీసం కృష్ణయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఆయన సతీమణి లక్ష్మి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అంతకు ముందు చండీయాగం మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జేకే ఓసీ మేనేజర్ పూర్ణచందర్, ఇతర అధికారులు గిరిధర్‌రావు, తుకారాం, రామ్మూర్తి, శివవీరకుమార్, సతీష్‌కుమార్, ప్రాజెక్టు ఇంజనీర్ చిన్నయ్య, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, శివప్రసాద్, కార్మిక సంఘాల నేతలు కె.సారయ్య, నజీర్ అహ్మద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పట్టణంలో ప్రధాన రోడ్ల పునఃనిర్మాణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన రోడ్లకు మరమ్మతులు చేయాలన్న స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి ఫలించింది. సింగరేణి సంస్థ సీఎండీ బలరాంతో పలుమార్లు సమావేశమై రహదారుల సమస్యను వివరించడంతో యాజమాన్యం సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం పోస్టాఫీసు రోడ్డు, సింగరేణి ఆస్పత్రి రోడ్డు, బస్టాండు – త్రిమాత టెంపుల్ రోడ్లను సింగరేణి, మున్సిపల్, విద్యుత్, భగీరథ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే కూనంనేని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోస్టాఫీసు సెంటర్ నుంచి హేమచంద్రాపురం వరకు, సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి సింగరేణి ప్రధానాస్పత్రి, అదేవిధంగా సింగరేణి మెయిన్ స్టోర్స్ వరకు మూడు రోడ్లను యుద్ధ ప్రాతిపదికనే పునఃనిర్మాణ పనులు చేపట్టబోతున్నట్లు తెలిపారు. వీటికి సంస్థ ద్వారా రూ.2.80 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. రెండో విడతలో బస్టాండ్ సెంటరు నుంచి త్రిమాత టెంపుల్ వరకు రోడ్డు పునఃనిర్మాణం, రోడ్డు వెడల్పు, బస్టాండ్ గేట్ సెంటర్లలో హైమాస్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, కమిషనర్ సుజాత, సింగరేణి, ట్రాన్స్‌కో, మిషన్ భగీరథ అధికారులు సూర్యనారాయణ, రాజేంద్రప్రసాద్, సాంబశివరావు, రంగస్వామి, సాయి, ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు వంగ వెంకట్, రత్నకుమారి, ధర్మరాజు, ముడెత్తుల శ్రీనివాస్, నిర్మల, భాగ్యలక్ష్మి, అమీర్ తదితరులున్నారు.

దీపావళికి స్వీట్లు పంపిణీ చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): దీపావళి పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులకు కేజీ స్వీట్ బాక్స్ పంపిణీ చేయాలని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత సంవత్సరం కార్మికులు కష్టించి పనిచేస్తే వచ్చిన లాభాల్లో రూ.4000 కోట్లు పక్కన పెట్టి, కేవలం రూ.రెండు వేల కోట్లపై 34శాతం వాటా చెల్లించారు. ఏటా పక్కన పెట్టిన డబ్బులను ఏం చేస్తున్నారో వివరాలు తెలపాలన్నారు. దసరా పండుగ తెలంగాణ సంప్రదాయ ఆచారాలతో కూడిన పండుగ, అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున రావటంతో కోలిండియాలో మూడో తేదీకి మార్చిన విధంగా సింగరేణిలో మార్చకపోవటంతో కార్మికులు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతీనెల జరగాల్సిన మెడికల్ బోర్డు ఏడు నెలలుగా జరగడం లేదన్నారు. పూర్తిస్థాయి డైరెక్టర్(పా) వస్తే కార్మికుల సమస్యలు తీరతాయని అనుకున్న కార్మికులకు చేదు అనుభవం ఎదురవుతోందన్నారు. రానున్న ఐదేళ్లలో కొన్ని గనులు మూతపడతాయని, దీనివలన కార్మికవర్గం ఆందోళన చెందుతోందని పేర్కొన్నారు.

పీఎం ధన్ ధాన్యకృషితో రైతులకు మేలు



మోదీ ప్రసంగం వింటున్న చైర్మన్, డైరెక్టర్లు, రైతులు

టేకులపల్లి: రైతులకు మేలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పీఎం ధన్ ధాన్యకృషి పథకం ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య, ఆహార ప్రాసెసింగ్ ప్రాజెక్ట్ కింద వెనకబడిన వంద జిల్లాలను గుర్తించి శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని దేశ వ్యాపితంగా ఉన్న అన్ని పీఏసీఎస్ కార్యాలయాల వద్ద ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇందులో భాగంగా బేతంపూడి సొసైటీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని రైతులు, సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు వీక్షించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి ధన్ ధాన్యకృషి పథకం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సొసైటీ డైరెక్టర్లు ఉల్లోజి ఉదయ్, భూక్యా బాలాజీ, దోర్నాల విజయ్‌మోహన్‌రావు, కందుల వెంకటేశ్వర్లు, ఇఫ్కో కంపెనీ ప్రతినిధి ప్రేమ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

అందరికీ ఈఎస్‌ఐ అమలు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఈఎస్‌ఐ అమలు చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం డీవైజీఎం రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ప్రతీ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనంతో సంబంధం లేకుండా అందరికీ ఈఎస్‌ఐ అమలు చేయాలని, యాజమాన్యం ప్రకటించిన ఉత్తర్వులో జీతం రూ.21 వేల కంటే ఎక్కువ ఉన్నవారికి ఈ స్కీమ్ వర్తించదని చెప్పటం సరైందికాదన్నారు. సంస్థ ఉన్నతాధికారులు కార్మికులకు సహాయం అందిస్తుంటే, కొంతమంది అధికారులు అడ్డుకోవటం గర్హనీయం అన్నారు. భూక్యా రమేష్, లెనిన్, వెంకటేష్ పాల్గొన్నారు.

వరద వెళ్లేదెలా..?



రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న వరదనీరు

ఇల్లెందురూరల్: పూర్వం నుంచి పంట చేల నుంచి వచ్చే వరద ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారి నుంచి సుదిమళ్ల, పూబెల్లి గ్రామపంచాయతీలకు వెళ్లే రోడ్డు మీదుగా వెళ్లేది. కానీ ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలు జరగడంతో వరదనీరు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. రోడ్డుకు ఒకవైపు నీటి ప్రవాహానికి అడ్డుగా ఇంటి నిర్మాణం చేపట్టారు. దీంతో వరదనీరు నెమ్మదిగా రోడ్డు మీదుగా దాటుతోంది. మరోవైపు కూడా ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో నీటి ప్రవాహం ముందుకు సాగడం లేదు. వరదనీరు రోడ్డు మీదుగా నిరంతరంగా ప్రవహించడంతో పాకురు పట్టింది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ ప్రాంతం చెరువును తలపించింది. నీటి నిల్వ తగ్గే వరకు సుదిమళ్ల, పూబెల్లి గ్రామపంచాయతీలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంచాయతీ అధికారులు, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శంకుస్థాపనకు రెండున్నరేళ్లు

- వానొస్తే వరద ముంపుతో అవస్థలు
- కోయగూడెం బ్రిడ్జి కోసం 15 గ్రామాల ప్రజలు ఎదురుచూపు
- నాడు శంకుస్థాపన చేసిన జెడ్పీ చైర్మన్ నేడు ఎమ్మెల్యే



కోయగూడెంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిన ప్రాంతం

టేకులపల్లి: టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామంలోని రైస్ మిల్లు వద్ద గల కల్వర్టుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. భారీ వర్షం పడితే వరద ముంపుతో స్థానిక ప్రజల కష్టాలు వర్ణనాతీతం. గతంలో సంభవించిన భారీ వరదల నేపథ్యంలో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. దీంతో గత బీఆర్‌ఎస్ హయాంలో ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య ఉన్న సమయంలో ఎఫ్‌డీఆర్ నిధులు రూ.2.50 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి మంజూరయింది. 2023 ఏప్రిల్‌లో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మారింది. ఆనాడు జెడ్పీ చైర్మన్‌గా ఉన్న కోరం కనకయ్య ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. శంకుస్థాపన చేసి రెండున్నరేళ్లు అవుతున్నా నేటికీ పనులు ప్రారంభం కాలేదు.

పలు గ్రామాల ప్రజలకు ఇబ్బంది..

కోయగూడెంలో బ్రిడ్జి నిర్మాణం చేపడితే పదిహేను గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుంది. టేకులపల్లి, ఇల్లెందు, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ నుంచి కోయగూడెం మీదుగా చుక్కాలబోడు, దంతెలతండా, ఇప్పలతండా, బావోజీతండా, రావులపాడు, మద్రాస్‌తండా, మోదుగులగూడెం, లచ్చగూడెం,కిష్టారం, రోడ్డు గుంపు, సంపత్‌నగర్, సిద్ధారం, మొట్లగూడెం తదితర గ్రామాల నుంచి నిత్యం రాకపోకలు జరుగుతుంటాయి. వానాకాలంలో భారీ వర్షాలు పడితే ఇక అంతే సంగతులు. వరద ప్రభావంతో ఈ మార్గంలో ప్రయాణం చేయలేని దుస్థితి ఏర్పడుతుంది. ప్రమాదాలు జరగక ముందే ఉన్నతాధికారులు స్పందించి కోయగూడెంలో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం పనులు మొదలు పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఫలకం

పనులు ప్రారంభించాలి...



కోయగూడెంలో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి రెండున్నరేళ్లు అవుతోంది. నేటికీ పనులు ఎందుకు ప్రారంభించలేదో అర్థం కావడం లేదు. వానాకాలం భయభ్రాంతులతో ఈ మార్గంలో ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రమాదాలు జరగక ముందే సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలి. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ తీసుకుని బ్రిడ్జి నిర్మాణ పనులు సత్వరమే ప్రారంభించేలా కృషి చేయాలి. – జర్పుల సుందర్, కొండంగులబోడు